క్లుప్తంగా

తాగునీరు కలుషితం



హిందూపురం పట్టణంలోని పరిగి రోడ్డులో వృథాగా పోతున్న నీరు

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని పరిగి రోడ్డు నీళ్ల ట్యాంకు వద్ద పైపులు లీకేజీ కావడంతో తాగునీరు వృథా అవుతోంది. పక్కనే మురుగునీరు వెళుతుండటంతో ఆ నీరంతా పైపుల గుండా మంచి నీటిలో కలుస్తోంది. రోడ్డుపైకి నీరు చేరడంతో నీరు పేరుకుపోయి దోమల వ్యాప్తి ఎక్కువైనట్లు స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు మంచి నీళ్లు కలుషితమవుతుండటంతో వ్యాధులు ప్రబలుతాయని, అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే తిమ్మారెడ్డికి ఘన నివాళి



తిమ్మారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తిమ్మారెడ్డి 30వ వర్ధంతిని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, రొళ్ల ఎంపీపీ కవితవిజయరంగేగౌడ్, ఎంపీపీ సత్యనారానాయణరెడ్డి, కేశవరెడ్డి, టౌన్ కన్వీనర్ సతీష్‌కుమార్, టౌన్ ఉపాధ్యక్షుడు గోపి, నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు నరసింహ, టౌన్ కార్యదర్శులు రఘునందన్, నరసింహులు, ఓంకుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంపచెట్ల తొలగింపు



కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రొద్దం: మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీ వద్ద ఓ సెల్ టవర్‌కు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద 11 కేవీ విద్యుత్ వైర్లకు కంపచెట్లు తగులుతుండటంపై 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన సాక్షిలో గురువారం కథనం వెలువడింది. స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంపచెట్లను తొలగించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి



మాట్లాడుతున్న అటవీశాఖ అధికారి

గోరంట్ల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని ఎంపీపీ ప్రమీల పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న పురోభివృద్ధి ఆయా శాఖల అధికారులు సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్ర, తహసీల్దార్ మారుతీ తదితరులు పాల్గొన్నారు.

ఐచర్ వాహనానికి నిప్పు



కాలిపోయిన ఐచర్ వాహనం

సోమందేపల్లి: మండలంలోని మండ్లి గ్రామ సమీపంలో ఐచర్ వాహనానికి దుండగులు నిప్పు పెట్టినట్లు వాహన యజమాని జయరాం తెలిపారు. బ్రహ్మసముద్రం నుంచి వాహనంలో మొక్కజొన్న గడ్డి హిందూపురానికి తీసుకెళ్తుండగా ఐచర్ మరమ్మతుకు గురి కావడంతో గురువారం రాత్రి వాహనం అక్కడే నిలిపి వేసి డ్రైవర్, మరోవ్యక్తి గ్రామానికి చేరుకున్నారన్నారు. అయితే శుక్రవారం ఉదయం వాహనం కాలిపోతున్నట్లు మండ్లి గ్రామస్తులు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొనేలోపే అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైందన్నారు. వాహనాన్ని కాలువలోకి తోసేసి దుండుగులు నిప్పు పెట్టారని వాపోయారు.

అన్నదాతపై బీమా పిడుగు

ఓ వైపు పంటలు సరిగా పండటం లేదు. మరోవైపు అరకొరగా పండిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేవు. దీనికితోడు కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతో ఇప్పటికే అన్నదాతలందరూ అప్పులపాలయ్యారు. తాజాగా కర్షకుల నెత్తిపై బీమా బండ పడింది. ప్రీమియం కడితేనే బీమా వర్తిస్తుందని అధికారులు తేల్చిచెబుతుండటంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది రైతుల పరిస్థితి.



- ఇప్పటికే అన్ని రకాలుగా రైతుల ఇబ్బందులు
- నేటికీ పెట్టుబడి సాయం అందించని కూటమి ప్రభుత్వం
- అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న కర్షకులు
- రైతులే బీమా ప్రీమియం చెల్లించాల్సి వస్తుండటంపై ఆగ్రహం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పక్కాగా ఉచిత బీమా

చెల్లించాల్సిన బీమా ప్రీమియం ఇలా..

పంట	ఎకరాకు
వేరుశనగ	రూ. 648
పత్తి	రూ. 1,923
దానిమ్మ	రూ.3,796
టమాట	రూ.1,619
బత్తాయి	రూ.2,783
మొక్కజొన్న	రూ.165
కంది	రూ.102
రాగి	రూ.100

మడకశిరరూరల్: వ్యవసాయ సాగులో రైతుకు ధీమానిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. గత రబీ సీజన్ నుంచి రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని స్పష్టం చేసింది. తుపాను, ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో బీమా అందాలంటే నొటిఫైడ్ చేసిన పంటలకు సంబంధించి బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులపై అదనపు భారం పడే విధంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రైతులు మండిపడుతున్నారు.

పెరిగిన రేట్లతో ఇబ్బందులు

కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాను రద్దు చేయడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరిగాయి. ఎరువులు, కూలి రేట్లు, భూమి దుక్కి, కలుపు మొక్కల తొలగింపు తదితర వంటి వాటికి కూలీ రేట్లు ఎక్కువగా ఉన్నాయి. వీటికి తోడు ఈ ఏడాది నుంచి రైతులపై బీమా భారం కూడా పడటంతో రైతు ఆవేదన చెందుతున్నారు. ఈ దశలో ప్రభుత్వ నిర్ణయం సరికాదని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వం తరహాలోనే కూటమి ప్రభుత్వం కూడా రైతుల తరపున సంబంధిత బీమా సంస్థలకు ప్రీమియం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ డబ్బులు బ్యాంకు ఖాతాలోకి జమ కాలేదని వాపోతున్నారు.

గతమెంతో ఘనం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పక్కాగా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకంలో భాగంగా మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, రొళ్ల, అగళి, అమరాపురం, గుడిబండ మండలాల్లో వ్యవసాయనికి సంబంధించి 45 వేల మంది రైతులకు పంటల బీమా నమోదు చేశారు. నష్టపోయిన సుమారు 40,775 మంది రైతులకు రూ.17.88 కోట్ల రూపాయలు నష్టపరిహారం చెల్లింపులు చేశారు. రైతు ప్రభుత్వంగా రైతుల గుండెల్లో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముద్ర వేసుకున్నారు.

బీమాకు ముంచుకొస్తున్న గడువు

ప్రధాన మంత్రి ఫసల్ బీమా కింద జిల్లా యూనిట్‌గా రాగి, ఆముదం, మండల యూనిట్‌గా వరి, మొక్కజొన్న, గ్రామ యూనిట్‌గా కంది పంటలు, మిగిలిన పంటలను వాతావరణ బీమా కింద పరిగణించారు. జూలై 15 లోపు రైతులు బీమా చెల్లించాలని అధికారులు చెబుతున్నారు.

మడకశిర నియోజకవర్గంలో సాగు భూమి ఇలా..

మడకశిర నియోజకవర్గంలో ఉన్న సాగు భూమి	42,750 హెక్టార్లు
గత ఏడాది సాగైన వేరుశనగ పంట	20 వేల హెక్టార్లు
ఈ ఏడాది ఇప్పటి వరకు సాగైన వేరుశనగ పంట	14250 హెక్టార్లు

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రాప్ ఇన్సూరెన్స్ భారం రైతులపై పడకుండా ప్రీమియం మొత్తం చెల్లించింది. అదే తరహాలో కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించాలి. ఉచిత పంటల బీమాను రద్దు చేయడం సరైన చర్య కాదు. ప్రభుత్వం పునరాలోచించి రైతులపై భారం లేకుండా చూడాలి.

– నరసింహమూర్తి, రైతు కదిరేపల్లి మడకశిర మండలం

పెట్టుబడి సాయమేదీ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు ఇచ్చి హామీ మేరకు సీఎం చంద్రబాబు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించలేదు. అప్పులు చేసి రబీలో పంటలను సాగు చేశాం. ప్రసుత్తం ఖరీఫ్ వేరుశనగ పంట సాగుకు అప్పులు చేయలేక వేరుశనగ పంటను సాగు చేయలేకపోతున్నాం. రైతు కష్టాలు గుర్తించి వెంటనే పెట్టుబడి సాయం ప్రకటించాలి.

– శ్రీరామరెడ్డి, ఎల్లోటి, మడకశిర మండలం

రైతులకు అన్నీ కష్టాలే..



చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో కూడా రైతులను ఎన్నో రకాలుగా ఇబ్బందులపాలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా ఉండేది. ప్రస్తుతం మళ్లీ రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటి వరకు రైతు బ్యాంకు ఖాతాకు పీఎం కిసాన్ తప్పా అన్నదాత సుఖీ భవ డబ్బులు జమ కాలేదు. తాజాగా బీమా బండ కూడా రైతుల నెత్తిన మోపడం దారుణం.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

ఎంపీటీసీకి పరామర్శ

మడకశిర: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మెళవాయి ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రప్పను శుక్రవారం వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఈరలక్కప్ప పరామర్శించారు. రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఈరలక్కప్ప ఏరియా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అన్ని రకాలుగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మండల పల్లి సర్పంచ్ అశ్వర్థనారాయణ, మండల కార్యదర్శి అంజలి తదితరులున్నారు.

'ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్'

చిలమత్తూరు: కూటమి ప్రభుత్వంలో విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె కాకినాడ జీజీహెచ్ ఘటనపై మాట్లాడారు. కాకినాడ జీజీహెచ్‌లో 50 మంది పారామెడికల్ విద్యార్థినిలపై ల్యాబ్ సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడటం, మాట వినకపోతే పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని బెదిరించడం దారుణమన్నారు. మహిళలకు, చిన్నారులకు , విద్యార్థినులకు ఈ కూటమి ప్రభుత్వంలో రక్షణ కరువైందన్నారు. ల్యాబ్ సిబ్బందిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చల్లాపల్లిలో పశువైద్య శిబిరం

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని పశుసంవర్ధ కశాఖ అధికారులు నిర్వహించారు. 57 పశువులకు గర్భకోశ చికిత్స అందించారు. అనంతరం నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో డీడీ సుధాకర్, వైద్యులు సుధాకర్, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ అధ్యక్షుడిగా శ్రీరాములు

హిందూపురం: ఏపీ అసోసియేషన్ కోపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా యూనిట్ అధ్యక్షుడిగా హిందూపురానికి చెందిన పీహెచ్ శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని శ్రీరాములు తెలిపారు.

వర్షం కోసం పూజలు

లేపాక్షి: మండలంలోని శిరివరంలో గంగమ్మ, సత్యమ్మ దేవతలకు వర్షం కోసం గ్రామస్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. గొద్దురాయిని పూజించి నీళ్లతో అభిషేకం చేసి వర్షాలు బాగా కురువాలని ప్రార్థించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

జనాభా పెరుగుదలతో సమస్యలు

హిందూపురం టౌన్: యువశక్తే దేశాభివృద్ధిని సూచిస్తే జనాభా పెరుగుదల ఎన్నో సమస్యలకు కారణమవుతుందని ఎన్ఎస్‌పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి అన్నారు. ఆ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, రాజనీతి శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ సరస్వతి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



రొద్దంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రొద్దం: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రధాన వీధుల్లో డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ శశికళ బాధ్యతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి: లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశా కార్యకర్తలు శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణ వలన కలిగే ప్రయోజనాలు, నష్టాలను వివరించారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

హిందూపురం: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ నారాయణస్వామి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కే వినోద్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బాబాయ్య, యూనియన్ రీజినల్ అసిస్టెంట్ సెక్రటరీ జీవి లక్ష్మీ , డిపో కార్యదర్శి మల్లికార్జున, గ్యారేజ్ కార్యదర్శి అర్షదుల్లా తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం ఈయూ (ఎంప్లాయిస్ యూనియన్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈయూ నాయకులు ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈయూ రీజనల్ సభ్యులు సిద్ధగంగప్ప, డిపో అధ్యక్షుడు రఫీక్, డిపో కార్యదర్శి రంగనాథ్, ప్రచార ఉప కార్యదర్శులు నారాయణస్వామి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించాలని నిరసన

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా డిగ్రీ విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల సమీపంలోని ప్రధాన రోడ్డుపై నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ఆరోపించారు. ఇంటర్ ఫలితాలు వచ్చి రెండు నెలలు కావస్తున్నా డిగ్రీ అడ్మీషన్లకు సంబంధించిన విధి విధానాలు ప్రకటించకపోవడం దారుణమన్నారు. డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఇరిగేపల్లి ఆధార్ సెంటర్‌లో దోపిడీ !

అగళి: ఇరిగేపల్లి సచివాలయంలోని ఆధార్ కేంద్రం దోపిడీకి అడ్డాగా మారింది. సచివాలంలో ఆధార్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ వీరేష్ ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక చార్జీలు వసూలు చేస్తున్నాడని ప్రజలు వాపోతున్నారు. ఆధార్‌కార్డులు మార్పులకు రూ.50 వసూలు చేయాల్సి ఉండగా రూ.150 నుంచి రూ.200 దాకా వసూలు చేస్తున్నాడన్నారు. చిన్న పిల్లలకు బయోమెట్రిక్ ఉచితంగా చేయాల్సి ఉన్నా రూ.100 నుంచి రూ.150 వసూలు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు ఇచ్చే రసీదులో అమౌంట్ కనబడకుండా దాన్ని చింపేసి ఇవ్వడం, ఇది ఏంటి అని ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయింది. వెంటనే వీరేష్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శాకంబరిగా చోళమాంబ



అమరాపురం: మండల కేంద్రంలోని కోట వీధిలోని వెలసిన చోళమాంబదేవి అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయాలతో ప్రత్యేక అలంకరించగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

మోసం చేయడమే చంద్రబాబు నైజం

పరిగి: ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని అది ఆయన నైజమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన ఆయన రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. శిరేకోళం, హొన్నంపల్లి, గణపతిపల్లి, పైడేటిల్లో ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సవిత, సర్పంచ్‌లు మంజునాథరెడ్డి, ప్రభాకర్, గంగాదేవి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



పైడేటిలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సోమందేపల్లి మండలం ఈదులబలాపురంలో..

సోమందేపల్లి: ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ఇంటింటికి వెళ్లి వివరిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్ తెలిపారు. శుక్రవారం ఈదుళబలాపురం, జూలకుంట, మండ్లి గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించార. సర్పంచులు సోము, కిష్టప్ప, అంజినాయక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, ఎంపీటీసీ నాగప్ప, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, నాయకులు నరసింహమూర్తి, కంబాలప్ప, వేణు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల పరిధిలోని దొగగట్ట, రెడ్డిపల్లి తదితర గ్రామ పంచాయతీల్లో శుక్రవారం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమ్మ, తిమ్మయ్య, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకలు అక్కులప్ప, ఎస్ నారాయణరెడ్డి, చిలకల రవి, జెట్టి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రొద్దం రెడ్డిపల్లిలో..

సంక్షిప్త సమాచారం

పార్టీ బలోపేతానికి కృషి

సోమందేపల్లి: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర తెలిపారు. శుక్రవారం జూలకుంట పంచాయతీ కమిటీను ప్రకటించారు. అధ్యక్షుడిగా సంజీవరాయుడు, ఉపాధ్యక్షుడిగా మారుతీ, ఎస్సీసెల్‌కు నాగరాజు, బీసీ సెల్‌కు ప్రభాకర్, మహిళా విభాగానికి గంగరత్నమ్మ, యువజన విభాగానికి శ్రీకాంత్, విద్యార్థి విభాగానికి హనుమంతరెడ్డి, రైతు విభాగానికి కిష్టప్ప, ప్రచార కమిటీకి ఆంజినేయులు, సోషియల్ మీడియా విభాగానికి హనుమంతరాయుడుతో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

బాల్య వివాహాల నిర్మూనలకు కృషి

రొళ్ల: బాల్య వివాహాలను నిర్మూలించడానికి కృషి చేద్దామని తహసీల్దార్ షేక్షావలి, మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఆర్డీటీ, ఐసీడీఎస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు, బాల్య వివాహాల నిరోధక కమిటీ సభ్యులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు విషయాలపై అవగాహన కల్పించారు.

ఎట్టకేలకు రాధమ్మ బదిలీ

పావగడ: స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ రాధమ్మ ఎట్టకేలకు శుక్రవారం బదిలీ అయ్యారు. తుమకూరు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా మహిమ రంగస్వామిని నియమించారు. రాధమ్మపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

'వీడియోలతో బ్లాక్ మెయిల్ చేస్తున్నారు'

పావగడ: 'ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యంగా రెవెన్యూశాఖ విభాగంలో కొందరు ఆర్టీఐ కార్యకర్తలు, అవినీతి నిరోధక సంస్థల పేరుతో కార్యాలయాల్లోకి చొరబడి పనిచేస్తున్న ఉద్యోగులు, ప్రత్యేకించి మహిళా ఉద్యోగుల హావ భావాలను వీడియోల్లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెడుతున్నారు. ఉద్యోగులను డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. దీంతో తాము పనిచేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలి' అంటూ రెవెన్యూశాఖ ఉద్యోగులు తాలూకా కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రం అందించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

గుడిబండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులను విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలన్నారు.

చేనేతలను ఆదుకోవాలి

సోమందేపల్లి: కూటమి ప్రభుత్వం చేనేతలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని చేనేత సంఘం మండల కార్యదర్శి నారాయణస్వామి తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ తీరుతో చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. చేనేతశాఖ మంత్రి సవిత చేనేతల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం: పట్టణంలో శనివారం 33 కేవీ పెద్దిరెడ్డిపల్లి లైన్ మరమ్మతుల కారణంగా సూగురు, ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలోని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. పట్టణంలోని సడ్లపల్లి, ఆటోనగర్, టీచర్స్ కాలనీ,ఎన్టీఆర్ నగర్, హౌసింగ్ బోర్డు, ప్రశాంత్ నగర్, సుగూరు, విద్యానగర్, పోచంపల్లి, కెకెపల్లి, వాల్మీకి సర్కిల్, చిన్నమార్కెట్, గాంధీ సర్కిల్, బండిమోటు, హుస్సాబాద్, పరిగిరోడ్, ఎంఎఫ్‌రోడ్, నింకంపల్లి, బాలయేసు స్కూల్ ఏరియా, రహమత్‌పుర్, సీపీఐ కాలనీ, సిల్క్ కాలనీ, పాండురంగనగర్, కోట ఏరియా, అంబేద్కర్ నగర్, మెయిన్ బజార్, డీఎల్‌రోడ్, ఆర్ఎస్‌రోడ్, ముక్కడిపేట, నేతాజీ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ ఉండదన్నారు.

రొళ్ల: మండలంలోని రొళ్ల, హొట్టేబెట్ట, హులికుంట, గుడ్డగురికి, రత్నగిరి, కాకి, దొడ్డేరి పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టాన్స్‌కో ఏఈ నిజాముద్దీన్ తెలిపారు.

పరిగి: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.